


ఐదు గంటల పది విముషాలయింది అప్ప టికి—మార్క్యుటు పద్మనాభంగారి మూడంతస్థుల మేడ వెనకాలకి పోతోతున్నాడు, మేడ యెదు రుగా వున్న వీధినిండా బంగారుకాంతులు పార బోస్తున్నాడు. వీధి చివరవున్న అడ్వకేటుగారి యింటిగుమ్మంలోకొచ్చి వాళ్ళ రాధిగాడి భుజం మీద చెయ్యివేసి తలవాల్చి నిలబడ్డాడు ఆ అబ్బాయి

అయిదు గంటల పన్నెండు నిమిషాలకి బయలుదేరిందా అమ్మాయి. ఆ అమ్మాయి ఎడం చేతి చిటికెనవేలుని భుజంమీద వేసుకుని పడవ వాడిలాగ లాగుతూ పోతున్నాడు కిట్టూ. "అబ్బా ఏమిట్రా అల్లరి" అన్నట్టుగా కొంచెం చిరాకు చూపుతూ చెయ్యి వెనక్కి లాక్కుంటోంది సరోజ. ఎడంచెయ్యి బలంగా లాగుతున్నా పూల సజ్జ పట్టుకున్న కుడిచెయ్యి వయ్యారం తొణకలే. కిట్టు లాగడం మానలే. మానడం ఆ అమ్మాయి కిష్టం లేదనుకుంటా. ఎందుకంటే ఆ అమ్మాయి పెదిమలు బిగబట్టినా నవ్వు జారిపోతోందాయె,

ఇదంతా చూస్తూనే వున్నాడా అబ్బాయి వీధి చివర్నించి అప్పటికి సుమారు యిరవై అయిదు అడుగుల దూరంలోకి సరోజ వచ్చేసింది. అంతే ఈ అబ్బాయి బుర్ర భూమాతవడిలో ఢాంకుంది.

రాధిగాడు భుజం తట్టి నవ్వుతున్నాడు. "ఏం మొగాడివిరా. ఎంత ధైర్యంరా" అంటూ.

"ఆ అమ్మాయి వింటేమో వీడి మాటలు!" యీ ఆలోచనతో యీ అబ్బాయికి ముచ్చెమటలు పోశాయి, అమాంతంగా యింటికి పరిగెట్టికెళ్లి ముఖం రుద్దుకుని తల దువ్వుకుని వస్తే బాగుం డును అనుకున్నాడు.

కాని వీల్లేదే. ఆ అమ్మాయి పాదాలుదగ్గర కొచ్చేస్తున్నాయి. కిట్టుగాడేమిటో వాగుతూనే వున్నాడు కాలేజీ లెక్చరర్‌లాగా, ఈ అబ్బాయి మనస్సు చాలా బాధపడింది. రాధిగాడిమీద కొంచెం కోపం వచ్చింది. ఆ అమ్మాయి పాదాలు దగ్గరకొచ్చేశాయి పల్లంచు పరికిణీ కుచ్చెళ్లు సము ద్రపు టలలమీది నురుగులా నాట్యమాడుతు న్నాయి, ఆ యెర్రటి పాదాల్ని తన కెదురుగా వచ్చాయి. దాటిపోతున్నాయి, హెచ్చుతూ వచ్చిన యీ అబ్బాయి గుండెవేగం తగ్గసాగింది, తల కొంచెం పైకెత్తసాగాడు.

ఎర్రటి మెత్తటి పాదాలు....పైన జానెడు వెడల్పు పల్లంచు....తరవాత తెల్లటి పరికిణీ... ఆపైన నల్లచుక్కల వల్లెవాటు....ఆ చేతులవల్ల పూలసజ్జకి దానిలోని పూలకి ఎంత అంద వచ్చిందో...తరవాత జవజవలాడే నడుం.

ఈ అబ్బాయింతధైర్యంగా ఆమె ఒక్కొక్క

శరీరభాగాన్ని నెమ్మదిగా చూస్కుంటూ ఆభినందిస్తూ తన్మయుడవుతూంటే రాధిగా డొక్కమూటరివాడు, "భానుమతిరోయ్! పొంటియాక్‌తో పోతోంది" అని.

పోతున్న కారు నంబరుకోసం కళ్ళెత్తి చూస్తున్నాడు.

ఈసరికి ఈ అబ్బాయి చూపులు నల్లత్రాచులాటి ఆమె జడపైనుంచి మెల్లిగా మెడపైకి పాకాయి. ఆమె మెడగురించి ఆలోచించి చూపులు కొంచెం పైకెత్తేసరికి ఆ అమ్మాయి సందు మలుపు తిరుగుతోంది.

ఈ అబ్బాయి చూపులు పూర్తిగా పైకి తెచ్చేసరికి అంటే భూమికి సమాంతరంగా అయిదడుగుల రెండున్నరంగుళాల ఎత్తుకొచ్చేసరికి ఆ అమ్మాయికి "యీ అబ్బాయింకా తల వాల్చుకునే వున్నాడా" అని సందు మలుపు తిరుగుతూండగా సందేహం వచ్చింది, రావడమేమిటీ అటుధైర్యంగా చూసింది. ధైర్యం ఎందుకంటే ఆఅబ్బాయి బహుశా తలెత్తి వుండడని ఆమె నమ్మకం. అంటే ఈ అబ్బాయి చూపులూ ఆ అమ్మాయి చూపులూ కలిశాయి. అయితే ఈ అబ్బాయి చూపులా అమ్మాయినేం చేశాయో నేను బాగా చెప్పలేను కానీ ఆ అమ్మాయి చూపులే అబ్బాయి మీదమాత్రం బాగా పనిచేశాయి.

అలాగ పైకి చూసిన అరక్షణం అనంతరం ఈ అబ్బాయికళ్ళు, తదనంతర బుర్రా, వాలిపోయాయి,—అరక్షణంసేపు ఎలా చూడగలిగానా—అని ఆశ్చర్యపోయాడతడు, ఆ సుముహూర్తంలో ఆ అమ్మాయి చూపులు అతని కళ్ళల్లోంచి గుండెల్లోకి దిగాయి.

గుండె కలుక్కుమంది అతనికి. కాళ్ళల్లోంచి వణుకు పుట్టింది. కళ్ళు చీకట్లు కమ్మాయి తల దిమ్మెక్కింది. తటాలున రాధిగాడి భుజం పట్టుకున్నాడు. వాడికిదేం తెలేదు. వాడు పూర్తిగా పద్మనాభంగారి గుమ్మంలో వున్న అల్సేషియన్ కుక్కల్ని చూడ్డంలో నిమగ్నుడయిపోయాడ

ఆ అమ్మాయి సందు మలుపు తిరిగిపోయిం కోవిలకెళ్ళడానికి.

అప్పటికి సరిగ్గా అయిదుగంటల పదమూడు నిముషాలయింది

"అమ్మయ్యా! అయిందిరా నీ రొమాన్సు పద బీచికి" అన్నాడు రాధాయ్ బరువు దించినట్టుగా.

.... ... ... ....

రోజూ యిదే కార్యక్రమం అతనికి. నాలుగు యాభై అయినకి మొహం సబ్బుతో కడిగి క్రీమ్ క్రీం రాస్కుని మంచి బట్టలు వేస్కుని తల జాగ్రత్తగా దువ్వి ఎత్వకేటుగా రింటికొచ్చేసరికి అయిదూ పదవుతుంది. సరిగా అయిదూ పన్నెండు నిమిషాల కా అమ్మాయి బయలుదేరుంతుది, ఈ అబ్బాయికెన్ని అవాంతరాలొచ్చినా అయిదూ పదికి కార్యక్రమం మార్చడు. అతడు దీన్నిబట్టి తక్కినది సర్దుకుంటాడు.

అక్కడ మీకు సందేహం కలగచ్చు, ఆ అమ్మాయి సరోజకూడా ఇంతేనా అని. అది మనం నిర్ధారించలేం.

ఎందుకంటే యిప్పటికి వాళ్ళొకళ్ళ నొకళ్ళు సరిగా చూస్కున్నది అయిదుసార్లు. నవ్వులు జారింది రెండుసార్లు. ఇంతమాత్రాన వాళ్ళు ప్రేమించుకున్నారనీ ఆ అమ్మాయి అందుకే సరిగా అయిదూ పది నిముషాలకి బయలుదేరుతుందనీ నిర్ధారణ చెయ్యడం పొరపాటు.

ఈ విషయానికి మీ రొప్పుకోరు. రోజూ ఆ అబ్బాయి అదే టయము కొస్తున్నప్పుడు ఆ అమ్మాయికూడా అదే టయంకి అంత సరిగ్గా బయలుదేరడం ఏమంటారు. కాని యీ అబ్బాయి యిందుకొప్పుకోడు. సంగతదీ.

ఈ అబ్బాయి ఆర్టిష్టు. చాలా బాగా బొమ్మలు రాస్తాడు. అయిదడుగుల నాలుగున్న రంగుళాల పొడుగు, కొంచెం నలుపు. ముఖ్య మేమిటంటే




అతనికి తగనిసిగ్గు, భయం. తను బాగుండనని అంచేత తన్ను చూసి అందరూ నవ్వుతుంటారనీ అనుమానం. అంచేతే రోజుకారుమాట్లు మొహం రుద్దుకుంటాడు. తల దువ్వుతాడు. తనమీద తన స్నేహితులకుండే అభిప్రాయంమీదే యింత అనుమానం వున్నవాడికి ఆడవాళ్ళమీదుండే అనుమానంసంగతి చెప్పాలా?

అంచేత ఈ అబ్బాయి ఏమంటాడూ అంటే ఆ అమ్మాయి నాకోసం ఐదోవన్నెండుకి బయలుదేరదూ—నేనే ఆ అమ్మాయికోసం ఐదూ పది కెదురుతామూ అని. కాని దరిమిలాను జరిగిన విషయాలవల్ల అతని పూర్వసంఘటనలు జ్ఞప్తికి వచ్చి వాటిలో విశేషాలు కొత్తరూపంలో కనపడ్డంవల్ల తన అభిప్రాయం మార్చుకుని చాలా సంతోషించి అది నాకు వెల్లడించాడు.

అసలు వాళ్ళ ప్రథమ సమాగమ వృత్తాంతం యిది. ఈ అబ్బాయి రెండు మాసాలక్రితం ఒక చక్కటి సాయంత్రకాలాన తన స్నేహితులు ఐదుగురితోకలిసి ఆవీధిలో తానిప్పుడు నిలుచున్న చోటులోనే నిల్చుని మాట్లాడుతున్నారట. అప్పుడా అమ్మాయి వాళ్ళింటోంచి బయలుదేరి వొక స్నేహితురాలితో కలిసి మాటాడుతూ వస్తొంది. ఈ అబ్బాయి కళ్ళని ఆ అమ్మాయి అందం వెంటనే ఆకర్షించింది, ఆ ఆకర్షణ ఎంత బలంగావుందంటే ఆపక్కనున్న స్నేహితురాలివైపేనాయితని కళ్ళు పోలేదట,

వీళ్ళ సమీపానికి రాగానే ఆ అమ్మాయి మాటలొక్కసారి ఆపేసి ఇతనున్నవైపుకి చూసింది. ఆ అమ్మాయి సగం మూసిన రెప్పల్లోంచి వచ్చే ఆ చూపులో యేదో వింత అనుభవం వుందంటాడు ఈ అబ్బాయి.

ఆ అమ్మాయి వెళ్ళినవైపే అలా పరధ్యానంగా అతని చూపులు పరుగెత్తాయి. "ఆ అమ్మాయి ఎంతబావుంది" అన్నది అతని మనసులోని మొదటి ఆలోచన. రెండవది— "ఆమె ఇటు చూసిందిగదా. అది ఎవరినిః...బహుశా

వస్తున్నావేమో.... అంత అందమైన అమ్మాయి నాకర్షించే అంత విశేషం నాముఖంలో వుందా! ...పొరపాటుపడ్డానేమో...లేకపోతే...". ఈలాగున అతగాడు తర్కిస్తూంటే పక్కని రాధిగాడన్నాడు "వీడు రానురాను మగాడవుతున్నాడురోయ్! పిల్లల్ని చూస్తున్నాడు" అని దీర్ఘం తీస్తూ.

రాధిగాడి స్టేట్‌మెంటు యేంతమాత్రం నిజం కాదు అని చెప్పడానికి పాయింట్లు యేరుతున్నాడా అబ్బాయి పరధ్యాన్నపు చూపులతో.

ఇంతలో ఆ అమ్మాయి తిరిగివస్తోంది. మళ్లీ ఆ అమ్మాయి నల్లటి కళ్లు పలకరించినట్లు తోచింది. ఈమాటు తనుకున్నది పొరబాటు కాదు. తనవైపే—ఎందుకంటే తన పరధ్యాన్నంచూసి స్నేహితులు తన కెదురువేపు తిరిగి తన్ని వింతగా చూస్తున్నారు. కొబట్టి తన్నే. ఆ అమ్మాయి చూపులలోని అర్థం అతను పూర్తిగా చెప్పలేదు, కానీ వాటిలో స్నేహం, ఒకవిధమైన ప్రేమా నిండుకొని వున్నాయంటాడతను.

ఆ అమ్మాయి కనపడినా, ఆ అమ్మాయి గురించి తలపులేనా ఆరోజునుంచి అతనికి పెద్ద శాంతి నిచ్చినట్టయ్యాయి. ఈ అబ్బాయికి పగలల్లా ఎంతవిచారంవున్నా సాయంత్రానికి అమృతమయమైన క్షణాలున్నాయికదా అని ఒక తృప్తి.

ఏమిటో ఇంతమందిలోనూ ఒక వ్యక్తిచేత గుర్తింపబడ్డాడనేది అతనికెంతో ఆనందదాయకమయింది. అందులో అది ఒక కన్య. అందమైన కన్య. అతని పదిహేడేళ్ళ జీవితంలోనూ ఇటువంటి తృప్తినీ ఆనందాన్నీ ఇచ్చి ప్రథమంగా వట్టిచూపులతో హృదయాన్ని చూరగొన్నది ఆ అమ్మాయే. ఆమె అతని జీవితాంతంవరకూ జ్ఞాపకంవుంటుంది.

కానీ ఆ అమ్మాయి ఇతగాడి ప్రేమని స్వీకరించిందా? అంటే "ఊహు" అనే జవాబుచాలా రోజులిచ్చాడు. దరిమిలాను మార్చుకున్నాడు. తనకు ఆమెయందుండే గాఢప్రేమ ఆమెకు తనయందుందో లేదో సరిగా చెప్పలేనంటాడు. తనని తక్కిన కుర్రాళ్ళలాగే చూసిందా అంటే అదీ గాదు. తనెంతమందిలో వున్నా వెతికి ఒక్కమాటయినా కళ్ళతో పలకరించి వెళ్ళేది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి సంగతులేతనికి తెలుసు. పేరు తెలుసు. కానీ ఆ అమ్మాయికి తన పేరు కూడా తెలీదు. ఆమె అరవబిడ్డ. ఈతడు తెలుగుబిడ్డడు.

అతనేమీ ఆలోచించలేదు ఎన్నాళ్ళిలాగ? తరవాతఏమిటిఅనేది అతను కోరేదేమిటంటే ప్రతిరోజూ ఒక్కసారి ఆ అమ్మాయికనిపిస్తేచాలు ఆ నల్లటి కళ్ళల్లోంచి వాలికే నవ్వే చాలుఅని. ఇంక అంతకుపైని వూహాలకి అతను తన మనస్సులో చోటివ్వలే. ఆ అమ్మాయి కనిపిస్తే ఆరోజు అతనికి పండగ. ఆ రెండు మధురక్షణాల్నీ ప్రశాంతంగా తూచని మళ్ళీ మళ్ళీ నెమరువేసుకోడానికి జాయిలంలా దాచుకుంటాడు.

ఈమధ్య ఒకనాటివిషయం, అతను మామూలుగా రాధిగాడి భుజంమీద చెయ్యేసుకుని నిల్చున్నాడు. అమ్మాయి ఆవేళ స్నేహితురాలితో బయలుదేరింది. తమ్ముడు కిట్టూ లేడు. ఆమె దగ్గరికి రానురానూ ఈ అబ్బాయి ఖుర్ర వాలుతోంది. తన్ని దాటుతున్నపుడు అమ్మాయి తన స్నేహితురాలితో అరవంలో చెప్పింది—"రేపు నా పుట్టినరోజు—పార్టీ యిప్పిస్తా రావే" అంటూ. వెంటనే ఈ అబ్బాయి మనస్సులో ఒక ఆలోచన మెరిసింది. తను షాక చక్కటి రంగుల గ్రీటింగ్సు కార్డు రాత్రివేసి రేపిస్తే...

దానిలోని కష్టం—అంటే అపిల్లకి ఎదురుగా నిలబడ్డం నవ్వడం, అది ఇవ్వడం, మళ్లీ తన పాతచోటుకి వెళ్ళడం ఇన్ని పనులు, ఇంత కష్టమయినవి యెలా చెయ్యాలో అతను ఆలోచించ

లే. ఆ ఆనందంలో వెర్రిధైర్యం మొండిధైర్యం

రాత్రి రెండు గంటలదాకా మేలుకుని పూర్తి చేశాడు ముద్దులొలికే గ్రీటింగ్సుకార్డు దాని అందం నే చెప్పలేను, దాంట్లో చక్కని సందేశం యేరి రాశాడు. మర్నాడు అయిదు గంటల తొమ్మిది నిమిషాలకి సరిగా బయలుదేరుతూంటే అతని గుండె కొట్టుకుంది.

తన భావి కార్యక్రమంలోని కష్టాలు భయంకరంగా కనుపించసాగినై. అలా మేడమెట్లమీద కూర్చుండిపోయాడు.

ఆరు గంటలకి మళ్లా -అతను మామూలు ప్రపంచంలోకొచ్చాడు, ఈలోగా అతని మనస్సులో రేగిన ఆలోచనలు దేముడికే తెలుసు, అతనికూడా తెలియవు...కిందకివెళ్లి మళ్లా మొహం రుద్దుకున్నాడు, తల జాగ్రత్తగా దువ్వాడు. బయలుదేరాడు.

అరున్నరకి సందుమలుపు తిరిగాడు. సరిగ్గా ఆమె అప్పుడే బయలుదేరుతోంది...ఇంకేం ఎదురుగా వెళ్లి, దగ్గరకురాగానే చేతికిచ్చి, తిన్నగా వెళ్లిపోదా మనుకున్నాడు— ఏమయినా సరే—నే చెప్పగలను పిరికివాళ్ళకి ధైర్యం వస్తే అది మొండిధైర్యం.

ఎడంచేత్తో, కార్డు పట్టుకున్న కుడిచేతినిపట్టుకుని, రెండుచేతుల్నీ వెనకాల పెట్టుకుని నడుస్తున్నాడు. దగ్గరకొచ్చినకొద్దీ యెడంచెయ్యి పట్టు వదలేసింది. కార్డుతోసహా కుడిచేయ్యి వెనకనించి పిర్రలమీదుగా తొడప్రక్కకి వస్తోంది.

ఇంక యెదురుగావచ్చే ఆ అమ్మాయి సరోజ కూడా తెలివైనపిల్లే. భూరంవించే ఇతగాడి ప్రయత్నం కొంచెం వూహించగల్గింది, ఈ అబ్బాయి ఇవాళ యేదో ఘనకార్యం చేసేందుకు ఇలా ధైర్యసాహసాలతో వస్తున్నాడని, చేతులు వెనక నుండటంమూలాని ఏదో బహుమానమో ప్రేమలేఖో అని.

ఇద్దరూ దగ్గరగా వచ్చేశారు. ఇప్పుడు యీ అబ్బాయికి కొత్తసమస్య వచ్చింది. అది యేమిటంటే ఈమెకి అసలు కార్డు ఇద్దామా వద్దా?అనేది ఇంతవరకూ ఎలా ఇయ్యడమా అనేదే సమస్య. కాని ఇయ్యడానికి అంతా అనుకూలమయిన కాలాన ఈ కొత్తసమస్య బయలుదేరగానే అతనికేం తోచలే

ఆ అమ్మాయికూడా ఇంతసేపూ ఇతని అభిప్రాయాన్ని ఊహించడంలో అమూల్యమైన కాలాన్ని వృధాచేసింది. కాని తనేం చేయాలో ఆలోచించలా. తీరా దగ్గరకొచ్చాక, అతని తటపటాయింపు చూసి, తనసలుఆగాలో ఆగకూడదో ఆగగలదో లేదో ఆలోచించుకోలేకపోయింది.

అకస్మాత్తుగా ఉద్భవించిన ఈ సమస్యల్ని ఇద్దరికిద్దరూ పరిష్కరించుకుందుకి అసమర్థులై తటపటాయిస్తున్నారు.

ఈ గొడవలో ఆ అబ్బాయి కున్న ధైర్యం కాస్తా జారిపోయింది. తొడదగ్గర్నుంచి పైకి లేస్తున్న గ్రీటింగ్సుకార్డుని పట్టుకున్న కుడిచేయి క్రిందకి వాలిపోయి, వెనక్కి పారిపోయి దాంకుంది. వేగం తగ్గి పూర్తి ఆగబోతున్న అతనిగా కాళ్లు చాలా తొందరగా పని చేశాయ్. తల బాగా వాలిపోయింది.

ఆ అమ్మాయి కొంచెం బెదిరిపోయినా, పకాలున నవ్వి పరుగెత్తింది.

మహాచిత్రం ఏదంటే, అంత సిగ్గు పడే అబ్బాయికీకూడా ధైర్యం వొచ్చింది...అంత గట్టిగా నవ్వేశాడు...ఆమె పొరుగాటి నవ్వు చివరిభాగంలో ఇతని తృప్తి, ఆనందంతోనిండి చిన్న నవ్వు కలిసిపోయింది. పెనవేసుకుం శాశ్వతంగా. ఇద్దరి నవ్వులూ ఆ సాయంత్రం చల్లగాలుల వీపులెక్కి ప్రేమలోకాల్లోకి షికారు చడానికి వెళ్ళిపోయాయి,

ఆ అమ్మాయి గుడిక్కీ—ఈ అబ్బాయి బీచికి వెళిపోయారు. ఆరుగంటలా ముప్పైరెండు నిమిషాలైంది.

తమిళ సంవత్సరానికి రెట్టించిన ఉత్సాహంతో, శ్రమతో, ఓపికతో గ్రీటింగ్సు కార్డుతయారు చేశాడు, దానికి నూరు రూపాయలిచ్చి కొంటే దండుగ లేదనుకుంటాను,

ఒకవారంపాటు ప్రియాదర్శనంకూడా మానేడు- కార్డుపనిలో మునిగి అమాయికమైన వూహలతోటి, సరిగ్గా సంవత్సరాది సాయంత్రం వచ్చాడు- ఈ మాటైతే కార్డు బహిరంగంగానే పట్టుగున్నాడు- రాధ కనపడ్డాడు- బద్ధకంగా అన్నాడు "మీ నరూదర్శనం లేదురా" అంటూ- ఇద్దరూ వాళ్ళింటిముందరగా వెళ్ళారు- ఇంటికి తాళం!

అతనికి ఉత్సాహం కూలిపోయింది- తల వాల్చుగున్నాడు బాధతో........

ఇక్కడ ఒక విషయం చెప్పాలి ఈఅబ్బాయి విచిత్రప్రణయగాథ నేనింత తేలికగా హాస్యంగా మొదలుపెట్టినా చివరికి యీ కుర్రవాడి లేతమనస్సుకి యింత పసితనంలోనే యిటువంటి గాయం తగిలిందని చెప్పటానికి బాధగావుంది- ఈ కుర్రవాడిది సాధారణంగా నేటి యువకుల ప్రేమలాంటిదికాదు- ధీనంగా చెప్పవలసివస్తే కామోద్రేకాన్ని ప్రేమగా భావించిగాని ప్రేమే అని బొంకిగాని శారీరక సుఖంకోసం యింకా చెప్పవలసివస్తే తాత్కాలికోద్రేకోపశాంతికోసం అమాయక జీవితాల్ని గాయపరిచే సంఘటనలు అధికమని చెప్పగలను- ప్రేమ అనే బురఖాలో కామాన్ని దాచి మోసం చేస్తున్నారు- ఇది కొందరికి తెలిసి మరికొందరికి తెలియక- ఈ కుర్రవాడి ప్రేమ అలాంటిదికాదు. మొదట యీ అబ్బాయి తనని అసహ్యగించుకోకుండా తనంటే జాలిపడే మనస్సుని సరోజలో చూశాడు- ఆమెను పూజించాడు- కాలక్రమాన అది ప్రేమగా మారింది-

ఇది ఆ అమ్మాయికి యిష్టమే నని తను అనుకోటంవల్ల తమ ప్రేమానుబంధం చెడిపోవడం ఈ కుర్రవాడికి బాధాకరం. ఈవిధంగా దూరంగా వుంటూనే ఆమెను చూస్తూ యీ అబ్బాయి సంవత్సరాలు గడపగలడు, అందులో అతనికి ఆనందం తృప్తి మనశ్శాంతి దొరకాయి కనుక, ఇది ప్లెటోనిక్ లక్షణమని యీ జాతివాళ్లు అవకాశాలు లేక చేతకాక యిది ఔన్నత్యం పొందిన ప్రేమ అంటారని అనుకోవటం పొరపాటు. అయితే పరిస్థితులు అనుకూలిస్తే యీ కుర్రాడామెను వివాహమాడడా? యితని ప్రేమ పర్యవసానం యేమిటంటారు?

వివాహం గొడవగాని, ప్రేమ పర్యవసానంగాని ఈ అబ్బాయి మనస్సులో ఇంకా ప్రవేశించలే, అతను కోరిందీ కోరేదీ, పొందిందీ పొందతలచేదీ ప్రేమించే హృదయం.

కాని, "ప్రేమించే హృదయం కావలిస్తే, ఆ హృదయం అందమైన యౌవ్వనవతిదే అయి వుండాలా" అంటున్నారు కొంతమంది.

హృదయం మొదట సౌందర్యంచేతా, యవ్వనంచేతా ఆకర్షించబడుతుంది. తరవాత ఆ వ్యక్తిలో యవ్వన సౌందర్యాలకన్నా ఉత్కృష్టమయినదీ, శాశ్వతానందదాయకమైనదీ అయిన ప్రేమని చూచి- అది పొందగలిగితే దానికి హృదయం శాశ్వతంగా బద్ధమై పోతుంది. ఏ యవ్వన సౌందర్యాలు తనని మొదట ఆకర్షించాయో - వాటినే - తన ప్రేమానుబంధానికి అడ్డు రానంతకాలం కోరకుండా, వుండగలదు. అధమం వాటి ఆలోచనకూడా రాకపోవడానికి అవకాశాలున్నై. ఏనాడైతే ఒక స్త్రీ యవ్వన సౌందర్యాలు పరుడికి యివ్వబడటం మూలాన తన ప్రేమకి ఆటంకం కలుగుతుందో ఆనాడే ఆ స్త్రీని ప్రేమించే పురుషుడి హృదయం ఆమె యవ్వన సౌందర్యాలని కోరుతుంది. ఆ నాడే అతని హృదయం స్వార్థంతో నిండిపోతుంది. అప్పుడే తాను ఆమెను పొందటానికి యెంతకైనా తెగిస్తాడు. ఇది సాధారణ మానవుని (ప్రేమని అర్థం చేసుకున్న) నైజం.

వయసు మళ్ళినది, అందవిహీన, కృశాంగ అయిన స్త్రీకి ప్రేమించే హృదయం వుండొచ్చు కాని. అది అర్థంచేసుకోబడటానికి ఆకర్షించబడాలి. కాని ఆమె శారీరిక ఆకారం ఆకర్షించడం అరుదు. (పసివాళ్ళనుంచి ముసలివాళ్ళ వరకు-)అసాధారణత్వంగల మానవులు మహాశా హృదయాన్ని ఆకర్షించ గలరేమో!

ఇక్కడ యీ అబ్బాయి యితర సామాన్య మానవుల్లాగే మొదట ఆ అమ్మాయి - సరోజ - సౌందర్యం, యవ్వనంచూచి ఆకర్షించబడి వుండవచ్చు, కాని తరవాత తనక్కావలసిన స్నేహమయమైన హృదయం ఆమెలో చూడగానే ఆమె యవ్వన సౌందర్యాలు వదిలేశాడు. తనప్రేమకంతరాయం లేనంతకాలం యితనికాగౌడవఅక్కర్లేదు. కాని అంతరాయం తప్పదు. ఎలాగయినా యితనిది బూటకపు ప్రేమకాదు-ఒక మెట్టెక్కువ యిది.

............సరె! ఆ విధంగా తాళంవేసివున్న ఆ యిల్లుచూసి యీ అబ్బాయి బాధతో తలవాల్చుగున్నాడు. తలవాల్చగానే గేటుపక్కన మట్టిలో పచ్చని కాగితం కనబడింది. ఆతృతతో తీశాడు. ఆమె పెండ్లి శుభలేఖ. ఎవరో హోదాయున్న వుద్యోగితో- తంజావూరిలోట, జాగ్రత్తగా మడచి జేబులో పెట్టుగున్నాడు.

మర్నాటినుంచి పాపం! యీ అబ్బాయి అలవాటు ప్రకారం ప్రతిరోజూ వచ్చి మామూలు చోటిలో విల్చునేవాడు - ఆ యింటివేపు చూస్తూ ఆమె వస్తూవున్నట్లు ఊహించుకునేవాడు. నిట్టూర్చి వెళ్ళిపోయేవాడు.

నెలా పదిహేనురోజులు దొర్లిపోయాయి. అయిదు గంటల ఐదు నిముషాలకి యీ అబ్బాయి ఎప్పటిలాగే వించున్నాడు గేటులో, రాధాయి వూళ్ళోలేదు వాళ్ళంతా వూరికెళ్ళారు. ఇతడు మామూలుగానే ఆ యిల్లుకేసి చూస్తూ ఆమె ఎలా వచ్చేదో వూహిస్తున్నాడు,

అయిదు గంటల పన్నెండు విముషాలయింది- ఈ అబ్బాయికళ్లు ఆశ్చర్యంతో మెరిసాయి. క్షీర సముద్రంలో లక్ష్మిలాగ ఆ అమ్మాయి, శ్రీ సరోజా - బయటికి వచ్చి విల్చుంది కిట్టూ చెయ్యిపట్టుకుని - ఆమె మనస్సులాగే ముఖం ప్రశాంతంగా వుంది.

ఇన్నాళకి అబ్బాయి ధైర్యంగా తలెత్తి ఆమె కళ్లలోకి చూవాడు. ఆమె తల వాల్చింది. ఇంకొక యువకుడు వచ్చాడు లోపల్నుంచి. ఇద్దరూ బయల్దేరారు. కిట్టూ ఆతని చెయ్యిపట్టుకున్నాడు. "సరోజ భర్త" అని చెప్పింది యీ అబ్బాయి మనస్సు, ఆయన ముందు నడుస్తున్నారు కిట్టుతో- ఆయన నడకలో హోదా ఠీవి వున్నాయి- ఆయన నడకలోను చూపులోను యీ అబ్బాయి చదివింది యివి—"వెనక్కాల ఒచ్చేది నా స్వంత సరకు- నా డిగ్రీ ఉద్యోగం హోదా, మా సంపద ఎరపెడితే ఆ పిల్ల నాన్న ఆమె భోజన వసతికి పాకులేలిచ్చి ఆ పిల్లని నాకిచ్చేశాడు. మా యింట్లోనాకి ఒక చెవర్లెట్ కారు, మర్ఫీ రేడియో రెండు హౌండ్సు, ఒక మాంచి పెళ్లాం వున్నాయి. అది నాదే!" అని, నవ్వుకున్నాడు తన పిచ్చి ఆలోచనలకి - అందమైన అమ్మాయిని పెళ్ళిచేసుగున్న అతని (ఎంత ధనవంతుడైనా) మనస్సులోని అభిప్రాయాలు యిలా వుంటాయని ఎవ్వరూ చెప్పరు, చెప్పలేరు, కాని ఈ అబ్బాయి మనస్సులో యిందాక నేచెప్పిన పరిస్థితులవల్ల స్వార్థం అసూయ అల్లుకున్నాయి.

వాళ్లు తన దగ్గరకివచ్చారు. దాటిపోతున్నారు. వీధి చివ్వర యెవరో ఆరుగురు అందమైన పిల్లలు వించున్నారు. ఆయనగారి వేగం కొద్దిగ హెచ్చింది. ఎజమానివెంట వెళ్లేపెంపుడు జంతువులా సరోజకూడా గబగబా వెళ్తోంది. వెళ్లు వెనిక్కి చూసింది ఆమె కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

సందు చివ్వర్నుంచి వెళ్ళిపోతున్న పిల్లల్ని

చూస్తున్నారాయన, తన వెనక్కాలే వస్తూన్న అందాల రాశిని చూడకుండ, సరోజ మనువు తిరుగుతూ చిరునవ్వు నవ్వింది కన్నీళ్ళతోనె!

ఈ అబ్బాయి చూసాడు. తను ప్రప్రథమంగా ఆమె ముఖంలో చూసిన నవ్వే అది. ప్రేమతో పొంగి పొరలిపోతూంది ఆ నవ్వు - ఆమె నవ్వులో యీ అబ్బాయి చదువుకొన్నది...."మనిద్దరిదీ పవిత్రప్రేమ. ఒకర్నొకరు పొందడానికి కాకపోయినా ప్రేమ వ్యక్తపరచుగుందుకుకూడా సిగ్గుపడ్డాం - కాదు భయపడ్డాం - నాకుతెలుసు మనం మనల్ని బాగా అర్థంచేసుగున్నాం, నాయీ శరీరం, - తన డబ్బుతోటీ హోదాతోటీ నన్ను విలువకట్టే యీ ఉద్యోగికి - అమ్ముడుపోయింది - నా హృదయం ఆయనకి అర్థంకాలేదు - కాదు - ఆయన అర్థంచేసుగుందుకు ప్రయత్నించడానికి కూడా ఆలోచించరు. ఆయన కాళ్ళదగ్గరకి నేనో కానుకగా యివ్వబడ్డాను - అయాచితంగా రాబట్టి నా విలువతెలియదు - నువ్వు నన్ను పూర్తిగా అర్థం చేసుకున్నావ్! మానసికంగా పొందావ్. నా యవ్వన సౌందర్యాలు యింకొకరికి యివ్వబడటం మూలాన మన ప్రేమ ఆవలోకనాలికి అంతరాయం కల్గింది. ఇంకిపైన వాటిని లోకం సహించదు. మన - మనస్సులమీద ఇతరులు అధికారం చెలాయించటానికి ప్రయత్నించడం అన్యాయం, నువ్వు బాధపడటం నిజమే! ఎన్నాళ్ళకైనా నా మనసులో నీ ప్రేమ మెరుగుతూ వుంటుంది. నన్ను జ్ఞాపకం వుంచుగుంటావని ఆసిస్తున్నాన్ని ఇంక నన్ను చూడటానికి ప్రయత్నించటం -, బాధ ఎక్కువ చేసుకోవటమే! సెలవు."

అయిదుగంటల పదిమూడు నిముషాలయింది. తేలికపడ్డ హృదయంతో యీ అబ్బాయి ప్రశాంతమైనవీధికి వెళ్ళాడు. ఆఅమ్మాయి జనసంకీర్ణమైన స్వార్థపరమైన, విషపూరితమైన, భయంకరమైన, ప్రపంచంలోకి తన శరీరాన్ని ప్రవేశపెట్టింది.

